సాక్షి అనకాపల్లి

సోమవారం । 17 । జూన్ । 2024



వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం : వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. స్వర్ణనంపెంగలతో పూజ చేశారు.



పిడుగుల మోత

ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షం కురవడంతో పాటు పిడుగుల మోత మోగింది. 8లో



దివ్యాంగులతో 'తండేల్' ముచ్చట్లు

8లో

న్యూస్‌రీల్

రంగురాళ్ల క్వారీలో తవ్వకాలపై విచారణ



ఆరిల్లోవ అటవీప్రాంతంలో ఉన్న రంగురాళ్ల క్వారీని పరిశీలిస్తున్న ఎస్‌ఐ కృష్ణారావు

గొలుగొండ : ఆరిల్లోవ అటవీప్రాంతంలో ఉన్న రంగురాళ్ల క్వారీని గొలుగొండ ఎస్‌ఐ బి. కృష్ణారావు, నర్సీపట్నం అటవీశాఖ సెక్షన్ అధికారి సత్యనారాయణ ఆదివారం ఉదయం పరిశీలించారు. ఆరిల్లోవ అటవీప్రాంతంలో ఉన్న క్వారీలో తవ్వకాలు జరిగిన విషయంపై విచారణ ప్రారంభించారు. తవ్వకాలు ఎలా జరిగాయి, ఎప్పుడు జరిగాయి? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా క్వారీ ప్రాంతం అంతా మట్టి కరిగిపోవడం జరిగిందని ప్రస్తుతం అయితే తవ్వకాలు జరగలేదని చెబుతున్నారు. ఏదిఏమైనా పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పప్పుసెట్టిపాలెం, కరక, ఆరిల్లోవ, సాలిక మల్లవరం ప్రాంతాల్లో క్వారీల వద్ద పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేశామని ఎస్‌ఐ కృష్ణారావు, సెక్షన్ అధికారి సత్యనారాయణ తెలిపారు. పోలీస్, బేస్ క్యాంప్ సిబ్బంది గస్తీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది ఝన్సీరాణీ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సుమారు రెండు నెలల పాటు చేపల వేటకు దూరంగా ఉన్న మత్స్యకారులు ఈ నెల 15 నుంచి సముద్రంలోకి ఊసూరుమంటూనే వేటకు వెళ్లారు. రెండు నెలలుగా పస్తులుండగా ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం మాత్రం ఇప్పటి వరకూ అందలేదు. పైగా డీజిల్ వాడకపోతే పరిహారానికి అనర్హులు అనే నిబంధన వారికి శరాఘాతంగా మారింది. దీనికి మినహాయింపు ఇవ్వకపోతే దాదాపు 3 వేల మంది పరిహారానికి అనర్హులవుతారని ఆందోళన చెందుతున్నారు. నూతన ప్రభుత్వం తమ గోడు వినాలని కోరుకుంటున్నారు.

డీజిల్ మెలిక... అందని భరోసా



పూడిమడక తీరంలో చేపలను వలలో కట్టి తీసుకెళ్తున్న దృశ్యం(ఫైల్‌ఫొటో)

- జిల్లాలో ఆందోళనలో వేలాది మంది మత్స్యకారులు
- ఎన్నికల కోడ్‌తో పరిహారం వాయిదా వేసిన వైనం
- రెండు నెలలు గడిచి సముద్రంలోకి అడుగుపెట్టినా అందని పరిహారం

అచ్యుతాపురం : ప్రతి ఏడాది మే 15 నుంచి జూన్ 15 వరకూ సముద్రంలో వేటను నిషేధిస్తారు. దీనికి ప్రధాన కారణం సముద్రంలో చేపల సంతానోత్పత్తికి ఎటువంటి విఘాతం కలిగించరాదనే. వేట విరామ సమయంలో వలలను అల్లుకోవడం, బోట్లకు మరమ్మతులు చేసుకోవడం వారి జీవన విధానం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు మత్స్యకారులకు అరకొరగా పరిహారాన్ని ఐదు వేల చొప్పున అందజేసేవారు. ఇంత వరకూ బాగానే ఉండగా గత ప్రభుత్వంలో పరిహారాన్ని 10 వేల రూపాయలకు పెంచారు.

డీజిల్ మెలికతో ఆందోళన

చేపల వేట నిషేధ సమయంలో పరిహారాన్ని అందుకునేందుకు అర్హత పొందే విషయంలో మత్స్యకారులు వినియోగించే బోట్లకు డీజిల్ వాడాల్సి ఉంది. అయితే కొన్ని బోట్లను మిగిలిన వారు సర్దుబాటు చేసుకోవడం, ఒకే బోటులో రెండు మూడు కుటుంబాలకు చెందిన వారు వేటకు వెళ్లడంతో ఒక్కోసారి డీజిల్ వాడే అవసరం ఒక్కో మత్స్యకారునికి రాదు. గత ప్రభుత్వంలోనూ డీజిల్ వాడకపోతే పరిహారం పొందేందుకు అనర్హులు అనే నిబంధన ఉన్నప్పటికీ ప్రభుత్వం మినహాయింపు ఇచ్చి పరిహారాన్ని అందించేది. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా కొలువు దీరడం వల్ల కొన్ని పథకాల అమలు విషయంలో ఇంకా స్పష్టత లేదు. అయితే సీఎం పెట్టిన మొదటి ఐదు సంతకాల్లో కీలకమైన మత్స్యకారులకు సంబంధించి భరోసా విషయంలో ఉత్తర్వులు లేవు. ఇప్పటికే రెండు నెలల పాటు వేటకు దూరంగా ఉన్న మత్స్యకారులు పరిహారం ఎప్పుడు అందుతుందా? అని ఆశగా ఎదురు చూస్తుండగా, కొత్తగా డీజిల్ నిబంధన మింగుడు పడడం లేదు.

మినహాయింపు దక్కుతుందా?

మే నెలలోనే భరోసా పడితే మత్స్యకారులకు రెండు నెలల జీవనానికి భృతి కింద, వలలు, బోట్లు మరమ్మతులకు ఆర్థిక ఉపశమనం ఉండేది. జిల్లాలో 11,500 మత్స్యకారులు భరోసాకు అర్హులుగా ఆ శాఖ గుర్తించగా, కనీసం 3 వేల మంది డీజిల్ వాడడం లేదని గుర్తించారు. వారికి ఇప్పుడు మత్స్యకార భరోసా పడాలంటే కచ్చితంగా ప్రభుత్వం నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలి. మత్స్యశాఖ జిల్లా అధికారులు ఇప్పటికే ఈ విషయంలో ప్రభుత్వానికి నివేదిక పంపించినట్టుగా తెలుస్తోంది. సూపర్ సిక్స్, ఉమ్మడి మేనిఫెస్టో అమలు విషయంలో కాలయాపన ధోరణి ప్రదర్శిస్తే ఆ ప్రభావం వేలాది మత్స్యకారుల కుటుంబాలపై పడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. 61 రోజుల తర్వాత సముద్రంలోకి అడుగు పెట్టే మత్స్యకారులకు ఈ ఎన్నికల సమయంలో పరిహారం అందకపోవడంతో దిగాలుగా ఉన్నారు. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా తమకు పరిహారం ఇవ్వాలని వారు కోరినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.

అనకాపల్లి జిల్లా పరిధిలో 73 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తీరంలో ఉన్న ఆరు మండలాల పరిధిలోని 31 మత్స్య గ్రామాలు ఉన్నాయి. 11,500 మత్స్య కుటుంబాలు కేవలం చేపల వేట, విక్రయంపైనే ఆధారపడి ఉంటున్నారు.

మత్స్యకారులకు ఆర్థికంగా మద్దతు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ఆంధ్రా ఫిష్ వంటి కార్యక్రమాలను అమల్లోకి తీసుకొచ్చింది. తద్వారా చేపలకు మంచి డిమాండ్ కూడా పెరిగింది. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల భృతి కోసం 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం పెంచింది. గతంలో అరకొరగా ఉండే మత్స్యకార భరోసాను రూ.పదివేలకు పెంచడంతో మత్స్యకారులు ఆనందించారు. అయితే ఈ ఏడాది మత్స్యకారులకు ఎన్నికల నిబంధనలు శరాఘాతంగా మారాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి భరోసాను ఎటువంటి నిబంధనల అడ్డు లేకుండా ఎన్నికల హామీ మేరకు పెంచి అందజేయాలని పూడిమడక, తంతడి మత్స్యకారులు కోరుతున్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష



ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మహారాణిపేట (విశాఖ): నగరంలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్ష జరగ్గా సంబంధిత ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పర్యవేక్షించారు. కృష్ణా కాలేజీ, ఎంవీపీ కాలనీలోని గాయత్రీ కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రిలిమినరీ పరీక్షకు మొత్తం 9,735 మంది దరఖాస్తు చేసుకోగా 4,677 మంది హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, లైజన్ అధికారులు, ఇతర అధికారులు పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మూడో విడత చందనం అరగదీత ప్రారంభం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మూడో విడత చందనం అరగదీత ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 22న జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు స్వామికి సమర్పించే మూడు మణుగుల (120 కిలోలు) పచ్చి చందనం సమకూర్చేందుకు ఈ అరగదీత కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం ఏడు గంటల నుంచి 15 మంది నాల్గవ తరగతి సిబ్బంది చందనం అరగదీతను ప్రారంభించారు. తొలిరోజు ఆదివారం 35 కిలోల చందనాన్ని అరగదీశారు. ఇంకా మూడు రోజులపాటు చందనం అరగదీత కార్యక్రమం జరగనుంది.

ఇంటర్ అడ్మిషన్ల జోష్

- పది ఫలితాల పెరుగుదలతో ఇంటర్ విద్యకు డిమాండ్
- ఈ నెల 30 వరకు రెండో విడత ప్రవేశాల గడువు
- విద్యార్థులతో కళ కళలాడుతున్న కాలేజీలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 366 జూనియర్ కాలేజీలు
- గతేడాది 58,944 మంది విద్యార్థుల చేరిక
- ఈ ఏడాది లక్ష్యం సాధించేలా పక్కా కార్యాచరణ



ఇంటర్మీడియెట్ విద్యార్థులు



అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులతో వచ్చిన విద్యార్థులు

విద్యా సంవత్సరం	బాలురు	బాలికలు	మొత్తం
2020-21	25,330	26,314	51,644
2021-22	27,306	28,196	55,502
2022-23	29,127	28,901	58,028
2023-24	29,306	29,638	58,944

విశాఖ విద్య : ఇంటర్మీడియట్ విద్యకు క్రేజ్ పెరిగింది. ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు రావటంతో జూనియర్ కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దీంతో జూనియర్ కాలేజీలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో గల 182 కాలేజీలు ఉండగా అనకాపల్లి జిల్లాలో 143, అల్లూరిలోని 41 కాలేజీలు అందుబాటులో ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరం ఈ నెల ఒకటి నుంచే ప్రారంభమైంది. అయితే పాఠశాలలు జూన్ 13న ప్రారంభం కావటంతో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇప్పుడిప్పుడే టీసీలను తీసుకొని కాలేజీల్లో చేరేందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30 వరకు డెడ్ లైన్ పెట్టుకొని లక్ష్యం మేరకు అడ్మిషన్లపై ఫోకస్ పెట్టాలని ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు ఆదేశించారు.

ప్రభుత్వ కాలేజీల్లో స్పీడు పెంచాల్సిందే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో జూనియర్ కాలేజీలను అభివృద్ధి చేసి, మౌలిక వసతులు పెంపొందించింది. దీంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు క్రేజ్ పెరిగింది. నగరంలోని జైల్ రోడ్‌లో గల బాలికల కాలేజీ, డాక్టర్ వీఎస్ కృష్ణా, భీమునిపట్నం, పెందుర్తి, అదే విధంగా అనకాపల్లి జిల్లాలోని యలమంచిలి, చోడవరం అదే విధంగా అల్లూరి జిల్లాలోని జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట కాలేజీల్లో ప్రస్తుతం అడ్మిషన్లు బాగున్నాయి. మిగతా కాలేల్లో అడ్మిషన్లు అంతంత మాత్రమే ఉన్నట్లుగా తెలుస్తోంది. దీనిపై ఆయా జిల్లాల అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులకు 'ప్రైవేటు' గాలం

ఈ ఏడాది పదో తరగతిలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత కావటంతో జూనియర్ కాలేజీలకు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల వారు సీట్లు నింపుకునేందుకు విద్యార్థుల కోసం గాలిస్తున్నారు. కాలేజీల్లోని అధ్యాపకులకు టార్గెట్‌లు పెట్టి మరీ అడ్మిషన్ల కోసం వేట సాగిస్తున్నారు. చాలా కాలేజీల్లో వేసవిలోనే ముందస్తు అడ్మిషన్లు చేయటంతో కొన్ని మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, అదే విధంగా ప్లస్ టూ స్కూళ్లలో ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరని పరిస్థితులు ఉన్నాయి.

అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి



ఇంటర్మీడియెట్ అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రభుత్వ కాలేజీల్లో అందుబాటులో ఉన్న సీట్లన్నీ భర్తీ అయ్యేలా ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలి. అడ్మిషన్ల వివరాలను సకాలంలో స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేయాలి. విద్యార్థులంతా అడ్మిషన్ తీసుకునేలా వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలి. తరగతుల నిర్వహణపై దృష్టి పెట్టాలి.

– పి.మురళీధర్, ఆర్‌ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

కాలేజీల వారీగా సమీక్ష చేస్తున్నాం



లక్ష్యం మేరకు అడ్మిషన్లు నిర్వహించేలా కాలేజీల వారీగా సమీక్ష చేస్తున్నాం. మా జిల్లాలోని 20 ప్రభుత్వ కాలేజీల్లో ఇప్పటివరకు 1,300 సీట్లు భర్తీ అయ్యాయి. టెన్త్ పాసైన విద్యార్థులకు కొన్ని చోట్ల టీసీలు తీసుకోవటంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అలాంటి వాటిపై కూడా దృష్టి సారించి, వారి సమస్య పరిష్కరించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

– సుజాత, ఇంటర్ విద్యాధికారి, అనకాపల్లి జిల్లా

ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి



ప్రభుత్వ కాలేజీల్లో లక్ష్యం మేరకు సీట్ల భర్తీ అయ్యేలా తగిన కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. టెన్త్ పాసైన ప్రతీ విద్యార్థి కాలేజీలో చేరేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. దీనిపై జిల్లాలోని అన్ని కాలేజీలపై ప్రతీ రోజూ సమీక్షిస్తున్నాం. సబ్జెక్టు అధ్యాపకుల సమన్వయంతో అడ్మిషన్లపై దృష్టి సారించాలని ప్రిన్సిపాల్స్ ఆదేశించాం. మేము కూడా కాలేజీలను తరచూ పర్యవేక్షిస్తున్నాం.

– బి.రాధ, డీవీఈవో, విశాఖ జిల్లా

ప్రజలకు మంచి జరిగేలా పనిచేయండి

- జిల్లా అభివృద్ధిలో అధికారులదే కీలక పాత్ర
- జిల్లా అధికారులతో సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత



జిల్లా అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

సాక్షి, అనకాపల్లి: అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలో శాంతి భద్రతలను మెరుగు పరచి ప్రజలకు మంచి పరిపాలనను అందిస్తామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం అనకాపల్లిలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం రాష్ట్ర హోం మంత్రిగా నియమితులైన అనితను జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళల అదృశ్యం కేసులపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు తగిన న్యాయం చేస్తామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ఘనంగా సారె ఊరేగింపు



మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మకు ఆదివారం స్థానిక మోదమాంబ కాలనీకి చెందిన అధిక సంఖ్యలో భక్తులు పిండివంటలు, పండ్లుతో సారె ఊరేగింపుగా తీసుకొచ్చారు. అమ్మవారు కొలువైన సతకం పట్టు వద్దకు భారీగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజారోగ్యం 'గుట్కా'యస్వాహా!



గుట్కా, ఖైనీ ప్యాకెట్లు

- యథేచ్ఛగా నిషేధిత గుట్కా, ఖైనీ ప్యాకెట్ల విక్రయాలు
- పట్టించుకోని అధికారులు
- నర్సీపట్నం కేంద్రంగా వ్యాపారం

నర్సీపట్నం : నర్సీపట్నంలో గుట్కా మాఫియా రాజ్యమేలుతోంది. ఏ బడ్డీ దుకాణం చూసినా గుట్కాలు, ఖైనీలు విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్క నర్సీపట్నంలోనే దీని వ్యాపారం రూ.లక్షల్లో జరుగుతోందంటే అతిశయోక్తి కాదు. ప్రధాన సూత్రదారులందరూ పట్టణంలోనే రహస్య గోడౌన్‌లలో గుట్కా, ఖైనీలను నిల్వ చేసి వ్యాపారం సాగిస్తున్నారు. నర్సీపట్నమే కాకుండా పరిసర మండలాలు, అల్లూరి జిల్లాలోని కొయ్యూరు, జీకే.వీధి, చింతపల్లి మండలాలకు సరఫరా చేస్తూ వ్యాపారం సాగిస్తున్నారు. అయితే సెబ్, పోలీసులు వీటిని అడ్డుకునేందుకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

'మామూళ్ల'తో తార స్థాయికి...

గుట్కా మాఫియా తారస్థాయికి చేరుకుంది. క్రికెట్ బెట్టింగులా చాప కింద నీరులా వ్యాపించింది. ఎక్కడికక్కడ మామూళ్లు ఇస్తూ గుట్కా రాజులు తమ రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారు. రూ.వేల నుంచి ప్రారంభమైన వ్యాపారం రూ.లక్షలకు పడగలెత్తింది. ఏడాదికి సుమారు రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల వ్యాపారం జరుగుతుందనడానికి ఎలాంటి సందేహం లేదు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి ఇక్కడకు దిగుమతి చేస్తూ రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు.

సెబ్ పరిధిలో...

పొగాకు నిషేధిత విక్రయాలపై దాడులు తనిఖీలు సెబ్ పరిధిలోకి రావడంతో పోలీసులు మౌనం వహిస్తున్నారు. అయితే సెబ్ అధికారులు కూడా పట్టించుకోక పోవడంతో వ్యాపారం మూడు గుట్కాలు, ఆరు ఖైనీలుగా సాగుతోంది. పట్టణంలోటీ దుకాణం నుంచి బడ్డీ కొట్టుల్లో గుట్కా, ఖైనీ ప్యాకెట్లను బహిరంగంగానే విక్రయిస్తున్నారు. డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం నుంచే వ్యాపారం జరుగుతోంది. మండలాల నుంచి గ్రామాలకు గుట్కా, ఖైనీ సరఫరా చేస్తున్నారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో ఏజెంటుని నియమించుకొని వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. పర్సెంటేజీలు, అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేసుకుంటున్నారు.

రోజువారీ సరకుల మాటున...

ప్రతి రోజు అక్రమ మార్గంలో గుట్కాలు, ఖైనీలు డివిజన్‌కు చేరుతున్నాయి. రోజువారీ సరకుల రూపంలో వీటిని చేరవేస్తున్నారు. పేరుకు లారీల్లో వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, కందులు, పప్పులు తరలిస్తున్నట్టు వే బిల్లులు తీసుకుని పైన అసలు సరకు కింద గుట్కా, ఖైనీలు రవాణా చేస్తున్నారు. రూ.లక్షలు ఆర్జిస్తున్నారు.

దాడులు చేస్తాం..



పొగాకు నిషేధిత ఉత్పత్తులు విక్రయించడం నేరం. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదు. సెబ్ ఆధ్వర్యంలో దాడులు జరుగుతున్నాయి. మరింత ముమ్మరం చేస్తాం. విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

కె.సునీల్ కుమార్, (సెబ్ సీఐ, నర్సీపట్నం)

సరకు రవాణాలో ఆర్టీసీ దూకుడు!

- జోన్–1లో గతేడాది కంటే 5 శాతం పెరిగిన ఆదాయం
- మరింత మంది పార్సిల్ బుకింగ్ ఏజెంట్ల నియామకం



ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ రవాణా కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం : సరకు (కార్గో) రవాణాలో ఆర్టీసీ జోన్–1 దూకుడు ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలోని ఇతర జోన్లకంటే ముందుంది. గతేడాది కంటే ఐదు శాతం ఆదాయాన్ని అధికంగా ఆర్జించి రాష్ట్రంలో మొదటి స్థానంలో కొనసాగుతోంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఈ జోన్ పరిధిలో ఉన్నాయి. సరకు రవాణా ద్వారా ఈ జోన్‌కు గత ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ 15వ తేదీ వరకు రూ.4.72 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది అదే కాలానికి రూ.4.96 కోట్లను ఆర్జించింది. అంటే ఇది గతేడాదికన్నా ఐదు శాతం అధికమన్న మాట! ఇక జిల్లాల వారీగా పెరిగిన కార్గో ఆదాయాన్ని పరిశీలిస్తే అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా 17 శాతం, అల్లూరి సీతారామరాజు 16, అనకాపల్లి 8, విజయనగరం 6, విశాఖపట్నం 1, పార్వతీపురం మన్యం 1 శాతం చొప్పున ఉంది. వీటిలో పంటల విత్తనాలు, పాఠ్య, నోట్ పుస్తకాలను కంటైనర్ కార్గో, డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు (డీజీటీ) వాహనాల్లో రవాణా ద్వారా అధిక మొత్తం లభించింది. ఇంకా ఉత్తరాంధ్ర నుంచి హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాలకు జీడిపప్పు, గోధుమపిండి వంటివి రవాణా చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఇక్కడకు బుక్ చేసే సరకుల్లో బిస్కట్లు, ఆటోమొబైల్ స్పేర్ పార్టులు వంటివి ఉంటున్నాయి. ఇప్పటికే చాలావరకు పాఠశాలలకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనాల్లో రవాణా చేశారు. ఖరీఫ్ సీజన్ మొదలు కానుండడంతో రైతులకు అవసరమైన వివిధ రకాల విత్తనాలను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)లకు తరలిస్తున్నారు.

డీఎంఈలతో సమావేశం

డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (డీఎంఈ)లకు మీటింగ్ పెట్టి జోన్‌లో పార్సిల్ బుకింగ్‌లు మరింతగా పెంచేందుకు ఆర్టీసీ కార్గో సేవల విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జోన్ పరిధిలో పార్సిల్ బుకింగ్‌లను మరింత విస్తృతం చేయాలని, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తూ ముందుకెళ్లాలని, వినియోగదార్లకు సేవల ద్వారా చేరువ కావాలని సూచించారు.

ఏపీబీల నియామకం పెంపు



సరకు రవాణా ఆదాయంలో రాష్ట్రంలోకెల్లా జోన్–1 నంబరు వన్ స్థానంలో ఉంది. గత ఏడాది కంటే ఐదు శాతం పెరుగుదలతో అగ్రస్థానంలో నిలిచింది. ఆర్టీసీ కార్గో రవాణా వ్యవస్థను మరింతగా మెరుగు పరచడం ద్వారా ఆదాయాన్ని పెంచాలని యోచిస్తున్నాం. ప్రస్తుతం జోన్‌లో ఆథరైజ్డ్ పార్సిల్ బుకింగ్ (ఏపీబీ) ఏజెంట్లు 52 మంది ఉన్నారు. నెల రోజుల్లో వీరి సంఖ్యను 62కి పెంచనున్నాం. భవిష్యత్తులో మండలానికో ఏపీబీ ఏజెంట్ చొప్పున విధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నాం. ఏపీబీ ఏజెన్సీ కోసం సిటీ పరిధిలో అయితే రూ.5 వేలు, రూరల్‌లో రూ. వెయ్యి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు సమీపంలో డిపో అధికారులను సంప్రదిస్తే సరిపోతుంది.

– బలిజి అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్

క్లుప్తంగా

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీనూకాంబిక ఆలయంలో దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

తుమ్మపాల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు పట్టణంలో గవరపాలెంలో వెలసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివా రం కావడంతో భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఆలయంలో భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచియున్నారు. దీంతో ఆల యం భక్తులతో పోటెత్తింది. వందల సంఖ్యలో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి ఆలయం ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ అన్నారు.

ఎంపీ రమేష్ పీఏగా తులసీరామ్

చోడవరం రూరల్ : అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేష్ వ్యక్తిగత సహాయకునిగా సాగునీటి యాజమాన్య సంస్థ, చోడవరం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న బి.తులసీరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ సభ్యునిగా తాజాగా ఎన్నికైన రమేష్ తులసీరామ్‌ను తన వ్యక్తిగత సహాయకునిగా నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీంతో నీటిపారుదల శాఖలో విధులు నిర్వహిస్తున్న తులసీరామ్‌ను ఉద్యోగ బాధ్యతల నుంచి వెసులుబాటు కల్పించి డిప్యుటేషన్‌పై లోక్‌సభ ఎంపీ రమేష్‌కు పీఏగా నియమించారు. తులసీరామ్ ఎంపీ పీఏగా విధులు నిర్వహించినందుకు టీఏ కింద నెల నెలా వెయ్యిరూపాయలు వేతనంతో పాటు అదనంగా డ్రా చేయనున్నారు.

బుచ్చెయ్యపేట మండలంలో అంధకారం

- గాలివానతో నేలకొరిగిన కరెంటు స్తంభాలు, చెట్లు
- 24 గంటలకుపైగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం



గంటికొర్లాంలో నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



కొమళ్లపూడిలో నేలపై పడిన విద్యుత్ స్తంభం

బుచ్చెయ్యపేట: మండలంలో గాలివానకు పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దాంతో 24 గంటలు గడిచినా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాక ప్రజలు అంధకారంలో గడిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కురిసిన గాలివానకు గంటికొర్లాం, కొమళ్లపూడి, బుదిరెడ్లపాలెం, లోపూడి తదితర గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలు దాటినా పాత కొండెంపూడి, కొత్త కొండెంపూడి, కొమళ్లపూడి, బుదిరెడ్లపాలెం, గొల్లకొంపలు, గంటికొర్లాం, పొట్టిదొరపాలెం, శింగవరం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. లోపూడి, కేపీ అగ్రహారం, తదతర గ్రామాల్లో గాలివాన పడి 20 గంటలు దాటిన తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పలు గ్రామాలు అంధకారంలో ఉండగా, వ్యాపారులు, హోటళ్ల యజమానులు వ్యాపార నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం కురిసిన గాలివానకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరలా శనివారం ఇదే పరిస్థితి నెలకొంది. దాంతో పలు గ్రామాల్లో విద్యుత్ మోటార్లు పనిచేయక వీధి కుళాయిలు ద్వారా తాగునీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతాల్లోని మంచి నీటి బోర్లు నుంచి తాగునీరు తేవడానికి మహిళలు అవస్థలు పడ్డారు. ఆదివారం సాయంత్రానికి పలు గ్రామాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ప్రారంభోత్సవానికి వంతెన సిద్ధం చేయండి



జల్లూరు వంతెనను పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేష్

కోటవురట్ల: మండలంలోని జల్లూరు వంతెన అప్రోచ్‌రోడ్డు పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అధికారులకు సూచించారు. ఆయన ఆదివారం అధికారులతో కలిసి వంతెనను పరిశీలించారు. పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ఇంకా ఎన్ని నిధులు అవసరమవుతాయో వారిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీ నిధుల నుంచి అప్రోచ్‌రోడ్డు పనులకు రూ.కోటి, బకాయిలు రూ.66 లక్షలు మంజూరు చేస్తామని, వెంటనే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

రేపు సాయంత్రం 6 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లభిస్తాయని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. స్వామివారి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం జరగనుండడంతో ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు.

సరుగుడు వద్ద సండే సందడి



జలపాతం వద్ద పర్యాటకుల సందడి

నాతవరం: మండలంలో సరుగుడు జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులు సందడి నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్య ప్రవహించే జలపాతం వద్ద సందర్శకులు స్నానాలను చేసి ఆనందంతో రోజంతా గడిపారు. నర్సీపట్నం, తుని, అనకాపల్లి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి వద్ద సందడి చేశారు.

తాటిపూడి జలాశయంలో మృతదేహం లభ్యం

మృతుడిది చోడవరం





జలాశయంలో నాగేశ్వరరావు మృతదేహం (ఇన్‌సెట్లో) నాగేశ్వరరావు (ఫైల్)

గంట్యాడ: విజయనగరం జిల్లా గంట్యాడ మండలం తాటిపూడి జలాశయంలో పడి అనకాపల్లి జిల్లా వాసి మృతి చెందాడు. ఈ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన జలగడుగుల నాగేశ్వరరావుకు ఎస్.కోటకు చెందిన వరలక్ష్మితో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. ఈ నెల 14న భార్యతో కలిసి అత్తవారింటికి వచ్చిన నాగేశ్వరరావు తాటిపూడి జలాశయానికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో నాగేశ్వరరావు భార్య ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే ఆదివారం ఉదయం తాటిపూడి జలాశయంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెళ్లి చూసి..నాగేశ్వరరావు మృతదేహంగా గుర్తించారు. అయితే ప్రమాదవశాత్తు జలాశయంలో పడిపోయాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల ఉల్లంఘనలపై దృష్టి సారించండి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ వై.సత్యనారాయణ, శ్యాంప్రసాద్, కౌన్సిల్ సభ్యులు

సీతంపేట: గ్రామాల్లో కుల వివక్ష, మహిళల పట్ల వివక్ష, సామాజిక లింగ వివక్ష అంశాలపై దృష్టి సారించాలని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ప్రథమ ఉప కులపతి ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ అధ్యక్షతన స్థానిక పౌరగ్రంథాలయంలో మానవ హక్కులపై పలువురు రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, సమాన న్యాయం జరిగినప్పుడే హక్కులు పరిరక్షణ సాధ్యమన్నారు. మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ సంస్థ సభ్యులంతా చట్టాలు, హక్కుల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. సమాజంలో ఉల్లంఘనలను గుర్తిస్తూ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేయాలని సూచించారు. విశ్రాంత అడిషనల్ ఎస్పీ ఎస్.దివాకర్, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ లఘు చిత్రాలను తిలకించి సమీక్షించారు. ప్రదర్శించిన మూడు లఘు చిత్రాలు జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ బహుమతులు పొందాయని శ్యాంప్రసాద్ తెలిపారు. కౌన్సిల్ సభ్యులు ఎస్వీ రమణ, డాక్టర్ వాసిని, వి.ఎన్.మూర్తి, సాగర్, అప్పారావు, అబ్దుల్, రెడ్డి పాల్గొన్నారు.

అమ్మ హెల్పింగ్ హార్ట్స్’ వితరణ

- రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.మూడు లక్షల అందజేత



ప్రశాంత్ కుటుంబానికి అందిస్తున్న ఆర్థిక సహాయం



మధు కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న అమ్మ టీం సభ్యులు, నాయకులు

బుచ్చెయ్యపేట : ఎదిగే వయస్సులో విధి వక్రించి ప్రమాదవశాత్తూ మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబాలకు అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు అండగా నిలిచారు. నెల రోజుల కిందట బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరవల్లి అగ్రహారానికి చెందిన మూడు పదుల వయస్సు లోపల గల శీలం మధు, విసారపు గణేష్ ఇద్దరు యువకులు మృతి చెందారు. వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థలో సభ్యులైన వీరు అకాల మృతికి సంస్థ సభ్యులు ఆవేదన చెందారు. పలువురికి రక్తదానం చేసే సంస్థలో ఉండి సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వీరు లేరని ఎప్పటికి తిరిగి రారని తెలిసి సభ్యులంతా ఆందోళన చెందారు. సంస్థ ద్వారా ఇప్పటి వరకు రక్తదానం ఇతర సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తోటి మిత్రులు చనిపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడకూడదని అమ్మ హెల్పింగ్ ఆర్ట్స్ సంస్థ సభ్యులు తీర్మానం చేసుకున్నారు. తమ సంస్థలో ఉండే మధు, గణేష్ కుటుంబాల్ని ఆదుకోవాలని తీర్మానించి సభ్యులంతా కలిసి విరాళాలు సేకరించారు. రూ.మూడు లక్షలు నగదు సేకరించి మధు, గణేష్ కుటుంబాలికి చెరో లక్షా పది వేలు చొప్పున ఇటీవల మృతి చెందిన వడ్డాదికి చెందిన మరో యువకుడు పత్తి ప్రశాంత్ కుటుంబానికి రూ.80 వేలు సహాయం ఆదివారం వారి ఇంటికెళ్లి అందించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, టీడీపీ అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, వడ్డాది టౌన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొండా నారాయణ మూర్తి, నాయకులు దొండా నరేష్, గిరిబాబు, శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, శంకర్,నాలం రమేష్ పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మరణించిన శ్రీను (ఫైల్)

నక్కపల్లి: కల్లు కోసం తాటి చెట్టెక్కి ప్రమాదవశాత్తూ కింద పడి గీత కార్మికుడు దుర్మరణం చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... నక్కపల్లికి చెందిన కర్రి శ్రీను(26) ఆదివారం ఉపమాక పంచా యతీ పరిధిలోని నూకాలమ్మ ఆలయానికి సమీపంలో తాటి చెట్టు ఎక్కాడు. కల్లు సేకరించే సమయంలో ప్రమాదవ శాత్తూ కిందపడి మరణించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే మరణించాడు. శ్రీనుకు వివాహం కాలేదు. తల్లిదండ్రులతోపాటు, సోదరుడు ఉన్నాడు. కుటుంబం ఇతని సంపాదనపై ఆధారపడి ఉంది. చేతికందొచ్చిన కొడుకు చెట్టుపై నుంచి పడి మరణించడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు



ఆంద్ర శ్రీనివాస్ (ఫైల్)

కశింకోట: భర్త అదృశ్యంపై భార్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం. వినోద్ బాబు ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటకు చెందిన ఆంద్ర శ్రీనివాస్ అచ్యుతాపురం వద్ద ఓ ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్నాడు. రోజూ తన బైక్‌పై యలమంచిలి వెళ్లి అక్కడి నుంచి పరిశ్రమకు చెందిన బస్సులో అచ్యుతాపురం వెళ్లి విధులను నిర్వర్తించేవాడు. తిరిగి అదే బస్సులో యలమంచిలి వచ్చి అక్కడి నుంచి బైక్‌పై ఇంటికి చేరుతాడు. అయితే ఎప్పటిలాగే ఈ నెల 13న పరిశ్రమకు వెళ్లిన శ్రీనివాస్ విధులు ముగించుకొని బయటకు వచ్చి పరిశ్రమ బస్సు ఎక్కినప్పటికి ఇంటికి చేరలేదు. ఈ మేరకు భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న ‘విమల’ ఉపాధ్యాయుల నిరసన

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయుల నిరసన కొనసాగుతోంది. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాల కొనసాగింపుపై మూడు రోజులుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఇంతకు ముందు జరిగిన చర్చల్లో ఉపాధ్యాయులు తమ డిమాండ్లను పాఠశాల యాజమాన్యం, హాజరైన పార్టీలు, కార్మిక సంఘాల నాయకులకు తెలిపారు. వారు ఉక్కు యాజమాన్యంతో చర్చిస్తామని ఉపాధ్యాయలకు హామీ ఇచ్చారు. కాగా.. ఆదివారం సెలవు అయినప్పటికీ ఉపాధ్యాయులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

దివ్యాంగులతో ‘తండేల్’ ముచ్చట్లు



దివ్యాంగులతో ముచ్చటిస్తున్న నటుడు నాగచైతన్య

కొమ్మాది/అచ్యుతాపురం : ఉమ్మడి విశాఖ జిల్లాలో ‘తండేల్’సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. మంగమారిపేట బీచ్, కొండకర్ల ఆవ, తంతడి బీచ్‌లో ఆదివారం సినిమా హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవిపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. మత్స్యకారుల వాస్తవ సంఘటన ఆధారంగా చందు మొండేటి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ విరామ సమయంలో నాగచైతన్య, సాయిపల్లవిలను దివ్యాంగులు కలిశారు. వారితో సుమారు 30 నిమిషాలు గడిపిన హీరో హీరోయిన్లు.. వారి యోగక్షేమాలు తెలుసుకుని, ఫొటోలు తీసుకున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ ప్రాంతానికి ఎవ్వరినీ అనుమతించలేదు.

సాగరతీరంలో ‘మా నాన్నే నా హీరో’



బీచ్‌రోడ్డు: వాక్ విత్ డాడీ, డ్యాన్స్ విత్ డాడీ, డాడీ మ్యాచింగ్ అంటూ చిన్నారులు వారి నాన్నలతో సందడి చేశారు. ఫాదర్స్ డే సందర్భంగా వీరు మామ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో ‘మా నాన్నే నా హీరో’పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. తండ్రి గొప్పతనాన్ని వివరిస్తూ పలు పోటీలు నిర్వహించారు. ఇందులో గెలిపొందిన చిన్నారులకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

పిడుగుల మోత



ఇందుకూరుపేటలో పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

- మూడు మండలాల్లో 26 మూగజీవాల మృతి
- పలు ప్రాంతాల్లో భారీ వర్షం



సూకురులో పిడుగుపాటుకు గురై మృతి చెందిన పశువులు

హుకుంపేట/దేవీపట్నం/చింతపల్లి రూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షం కురవడంతో పాటు పిడుగుల మోత మోగింది. పిడుగుపాటుకు గురై వేర్వేరు ప్రాంతాల్లో 26 మూగజీవాలు మరణించాయి. హుకుంపేట మండలం సూకురు సమీపంలో పిడుగు పడడంతో 13 పశువులు మరణించాయి. సూకురు గ్రామానికి చెందిన పశువులను శనివారం గ్రామ సమీపంలోని కొండపైకి మేతకు తీసుకువెళ్లారు. మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడడంతో కాపరులు భయాందోళనకు గురై, పశువులను అక్కడే వదిలి ఇళ్లకు చేరుకున్నారు. ఇంతలో పిడుగులు పడడంతో పాతుని బొంజుబాబు, పాతుని కొండబాబు, పరదాని లక్ష్మీపతి, గడుతురి చిట్టపడల్, కిముడు నాగేశ్వరరావు, పాంగి భైరవమూర్తి అనే గిరిజన రైతులకు చెందిన పశువులు మృతి చెందాయి. ఆదివారం ఉదయం కొండపైకి వెళ్లిన గ్రామస్తులు మృత్యువాత పడిన పశువులను చూసి ఆవేదన చెందారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. స్థానిక సర్పంచ్ దనసాని సత్యవతి బాధితులను పరామర్శించారు.

- దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో ఆదివారం మధ్యాహ్నం పిడుగుపడి పది మేకలు, గొర్రెలు మృతి చెందాయి.ఇందుకూరుపేట గ్రామానికి చెందిన పోతల అన్నవరం, దుర్గారావుకు చెందిన మేకలు,గొర్రెలు పొలాల్లో మేతకు వెళ్లిన సమయంలో పిడుగుపడడంతో మృతిచెందాయి. తమకు ఆధారమైన మేకలు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.
- చింతపల్లి మండలంలో కిటుముల పంచాయతీ లక్కవరంలో ఆదివారం పిడుగులు పడి రెండు పశువులు,ఒక మేక మృతి చెందాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి తనకు ఆదుకోవాలని బాధితుడు పంతల రాజబాబు కోరాడు.

ఇల్లు దగ్ధం

చింతూరు: మండలంలోని కాటుకపల్లిలో ఆదివారం పిడుగుపడి సోడె నాంచారమ్మ అనే గిరిజన మహిళ ఇల్లు దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులు బయటకు పరిగెత్తడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ ఘటనలో రూ.80 వేలు, రూ.50 వేల విలువైన బంగారం, ధాన్యం, నిత్యావసరాలు కాలిపోయాయి. తక్షణసాయం కింద బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందించినట్టు తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు. సర్పంచ్ సవలం సత్తిబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు రూ.12,600, మూడు క్వింటాళ్ల బియ్యం అందించి బాసటగా నిలిచారు. జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ రూ.10 వేలతోపాటు నిత్యావసర సరకులను అందజేశారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం నేడు

తుమ్మపాల: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుందన్నారు. పట్టణం, అనకాపల్లి, కశింకోట మండలాల పరిధి కార్పొరేటర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరుకావాల్సిందిగా కోరారు.

బక్రీద్ పండగకు సన్నాహాలు



కశింకోటలోని నూరి మసీదు

కశింకోట: మండలంలోని ముస్లింలు త్యాగానికి ప్రతి రూపమైన బక్రీద్ పండగను సోమవారం నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నూరి మసీదు, పురాతన జామియా మసీదు, నరసింగబిల్లి మసీదుల్లో ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సంప్రదాయంగా పండగను జరపనున్నట్లు వెల్లడించారు.

రామోజీరావుకు నివాళులు



పిల్లలకు స్టీల్ క్యారేజీలు అందిస్తున్న కుమార్, మూర్తి

తుమ్మపాల: పట్టువదలని, నిత్య కృషీవలుడు రామోజీరావు అని డీసీబీ బ్యాంకు మేనేజర్ కుమార్ అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు భవన్‌లో సోమవారం నిర్వహించిన రామోజీరావు స్మారక సమావేశంలో రామోజీ చిత్రపటానికి నిర్వాహకులు పి.మూర్తితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. రామోజీరావు సాధించిన ఘన విజయాలను పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా పిల్లలకు మూడుకప్పుల స్టీల్ క్యారేజీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీబీ బ్యాంక్ గోల్డ్ లోన్ విభాగం ఆర్ఎం కె.శేషుకుమార్, ఇన్నర్‌వీల్ సంస్థ ప్రెసిడెంట్ డి.శ్రీదేవి, మాజీ ప్రెసిడెంట్ మంజు భార్గవి, పిల్లలు పాల్గొన్నారు.

ఫాదర్స్ డే వేడుకలు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో మహిళా పారిశ్రామిక వేత్త గంధం సునీత ఆధ్వర్యంలో ఫాదర్స్ డే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామిక వేత్త అయిన తన తండ్రి దివంగత గంధం నందగోపాల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పాలసొసైటీ డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం

సబ్బవరం: మండలంలోని పైడివాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన పాల సొసైటీ ఎన్నికల్లో ఇద్దరు పాడి రైతులను డైరెక్టర్లుగా సొసైటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాల సొసైటీ అధ్యక్షుడు దాసరి వెంకట రమణ అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో పదవీకాలం పూర్తయిన ఇద్దరు డైరెక్టర్లు రాజీనామా చేయడంతో వారి స్థానంలో నూతన డైరెక్టర్ల ఎన్నిక జరిగింది. దాసరి ప్రసాద్, బొబ్బరి పెంటయ్యలను ఏకగ్రీవంగా సభ్యులంతా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడు దాసరి వెంకట రమణ మాట్లాడుతూ విశాఖ డెయిరీ అభివృద్ధితో పాటు పాడి రైతుల సంక్షేమానికి డైరెక్టర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దాసరి అక్కునాయుడు, వడ్డాది పెంటయ్య, సురేష్, కోమటి రమణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	: రాజా
మనమే	: సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్‌షాప్ మూర్తి	: సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	: షిర్డిసాయి
లవ్ మౌళి	: పర్తిసాయి
సత్యభామ	: వెంకటేశ్వర
గ్యాంగ్ ఆఫ్ గోదావరి	: శ్రీసత్య
హరోం హర	: రామచంద్ర



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు



మర్రిపాలెం పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పుస్తకాల పరిమళాలు.. పలకరింపుల సందళ్లు

- నూతనోత్సాహంతో విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న కొత్త పిల్లలు
- మరో పక్క జోరుగా పుస్తకాల పంపిణీ

కొత్త పుస్తకాలు, యూనిఫాంల గుబాళింపులు. పాత నేస్తాల పలకరింపులు. ఫేవరెట్ ఉపాధ్యాయుల ఆత్మీయ ఆశీర్వాదం. కొత్త తరగతుల్లో కూర్చునే స్థలాల కోసం వెతుకులాట.. ఇలా కొత్త పాతల సంగమంతో, ఆనందాల తుళ్లింతల నడుమ పాఠశాల ప్రాంగణాల్లో పండగ వాతావరణం కనువిందు చేస్తోంది. గత ప్రభుత్వం సమకూర్చిన సౌకర్యాలు పిల్లలను ఆకర్షించడంతో కొత్త విద్యార్థులు వచ్చి చేరుతున్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు జోరందుకున్నాయి. మరో పక్క పుస్తకాల పంపిణీ చురుగ్గా సాగుతోంది.



తరగతి గదిలో విద్యార్థులకు పాఠ్యాంశాన్ని బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తుమ్మపాల: విద్యావ్యవస్థలో గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రతి విద్యార్థి పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టపడుతున్నారు. గతానికి భిన్నంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెరగడంతో పాటు కొత్త అడ్మిషన్లు ఇందుకు నిదర్శనం. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది. వేసవి సెలవుల అనంతరం బడులు పునఃప్రారంభం కావడంతో పాఠ్యపుస్తకాల పంపిణీ, ప్రవేశాల ప్రక్రియతో స్కూళ్లు కళకళలాడుతున్నాయి.

పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు

మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రితో కూడి విద్యార్థి కిట్లు చేరుకున్నాయి. పాత విద్యార్థులతో పాటు కొత్తగా అడ్మిషన్లు పొందిన వారికి సైతం తొలిరోజే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. స్టూడెంట్ కిట్‌లో రూ.3 వేలకు పైగా విలువైన 8 రకాల వస్తువులను అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

మండలంలో వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	79
ప్రాథమికోన్నత పాఠశాలలు	09
ఉన్నత పాఠశాలలు	19
మొత్తం విద్యార్థులు	9,560

డిజిటల్ విద్య

సౌకర్యాలతో పాటు డిజిటల్ విద్య అందుబాటులోకి రావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌ఈడీ టీవీ ద్వారా ప్రైమరీ విద్యార్థులకు డిజిటల్ తరగతులను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హైస్కూళ్లలో ఐఎఫ్‌పీ ద్వారా డిజిటల్ బోధన జరుగుతోంది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుతో పాటు ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన అమల్లో ఉంది. ప్రాథమిక పాఠశాల నుంచి యూపీ, హైస్కూళ్లలో ఇదే విధానం కొనసాగుతోంది.

త్వరలో మిగిలిన సామగ్రి

విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందిస్తున్నాం. మండలంలోని అన్ని పాఠశాలలకు కొరత లేకుండా పూర్తి స్థాయిలో పుస్తకాలు పంపిణీ చేశాం. ఈ అకడమిక్ ఈయర్‌లో తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తున్నాం. స్టూడెంట్ కిట్‌లో మిగిలిన సామగ్రిని ప్రభుత్వ ఆదేశాల మేరకు వీలైనంత వేగంగా పంపిణీ చేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నాం.

– ఎంఈవో చిట్టిబాబు, అనకాపల్లి మండలం

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరించి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న మలసాల భరత్‌కుమార్, వేపాడ చిరంజీవిరావు

తుమ్మపాల: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను చేరాలంటే పదవ తరగతి తొలి మెట్టు అని, అందుకే మంచి ఫలితాలు సాధించేందుకు పట్టుదలతో చదవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జీవీఆర్ రెసిడెన్సీలో జిల్లా తూర్పు కాపు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాజా టెన్త్ ఫలితాల్లో 550 మార్కులు, ఆ పైన వచ్చిన విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రతిభ పురస్కారాలు, స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మలసాల భరత్‌కుమార్ విచ్చేసి విద్యార్థులను అభినందించారు. వారిని సత్కరించి, స్కాలర్‌షిప్‌లు అందించారు. విద్యార్థులు లక్ష్య సాధనలో ఎలాంటి సాయం కావాలన్నా తనను సంప్రదించాలన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ విద్య ఆవశ్యకత, చదువులో ప్రతిభకు చేయాల్సిన సాధన, ప్రస్తుత విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థుల సంసిద్ధతపై సూచనలిచ్చారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. 82వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి రమేష్, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, తూర్పు కాపు సంఘ అధ్యక్షుడు పలకా రాము, ఉషోదయ సంస్థల అధినేత రమణాజీ, సరస్వతి విద్యా సంస్థల అధినేత సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి నిర్ణయాలతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యేను అభినందించిన కూటమి శ్రేణులు

తుమ్మపాల: కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు బాధ్యతతో కూడిన సేవలందించేందుకు, కూటమి శ్రేణుల ఉమ్మడి నిర్ణయాల మేరకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని జనసేన, టీడీపీ, బీజేపీ కార్యాలయాలలో ఆదివారం ఆయనకు అభినందన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు పండగలా పాల్గొని ఓట్లేశారని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, తన వంతు సేవలందిస్తానన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూటమి శ్రేణుల్ని సమన్వయపరచుకుంటూ ఉమ్మడి నిర్ణయాలతో ముందుకెళతామన్నారు. తొలుత మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నివాసానికి వెళ్లారు. దాడి కుటుంబ సభ్యులకు కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. జనసేన, బీజేపీ కార్యాలయాలకు హోం మంత్రి వంగలపూడి అనిత వచ్చి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ధన్యవాదాలు తెలిపారు. జనసేన కార్యాలయంలో మూడు పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొణతాలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీలు మాధవ్, బుద్దా నాగజగదీష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

40 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

తుమ్మపాల: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల, మరొకరికి ప్రాణదానం చేసినవారవడంతో పాటు, ఆరోగ్యం కూడా సిద్ధిస్తుందని డాక్టర్ వైడీఎస్ మూర్తి అన్నారు. పట్టణంలోని లోటస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే సందర్భంగా శ్రీ గౌరీ గ్రంథాలయంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఆయనతో పాటు ఎస్‌డీ గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, గ్రంథాలయం ప్రతినిధులు కాండ్రేగుల వెంకటరమణ, మల్ల బాపునాయుడు ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో విల్లూరి రాజేష్, కాండ్రేగుల జగన్నాథరావు, మారిశెట్టి భాస్కరరావు, వేదరి సంతోష్, కోరుబిల్లి రేవంత్, ఆళ్ల ప్రభాత్, కర్రి గంగాధర్‌తో సహా 40 మంది రక్తదానం చేశారు.

ముసుగులు తొలగించరూ..



కశింకోటలోని పంచాయతీ ప్రధాన రహదారిలో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి ఉన్న ముసుగు



ముసుగు తొలగించని దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం

కశింకోట: ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ కశింకోటలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించకపోవడం పట్ల అభిమానులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నిబంధనల మేరకు స్థానిక పంచాయతీ ప్రధాన రహదారిలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, మాజీ ఎంపీ దివంగత గుడివాడ గురునాథరావు తదితర నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి, కోడ్ తొలగినా ముసుగులు మాత్రం అలానే ఉంచేయడం శోచనీయమని అభిమానులు, పార్టీ శ్రేణులు ఆక్షేపిస్తున్నారు. కోడ్ ముగిసినందున విగ్రహాలకు ముసుగులు తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా నవదుర్గ ఆలయ వార్షికోత్సవం

రాంబిల్లి: మండలంలోని కట్టుబోలు గ్రామంలో ఆదివారం నవదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు . మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

ధ్యాన వేంకటేశుడి కల్యాణోత్సవం నేడు



కల్యాణానికి సిద్ధం చేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు



కశింకోటలో విద్యుద్దీపాలంకరణలో వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరం

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరం కల్యాణోత్సవానికి ముస్తాబయింది. జ్యేష్ట మాసం శుద్ద ఏకాదశి పురస్కరించుకుని ఏటా స్వామి వారికి నిర్వహించే వార్షిక కల్యాణోత్సవం సోమవారం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించి, ముస్తాబు చేశారు. ఆలయంలో మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించేందుకు అనువుగా వజ్ర కవచం, ఆభరణాలు త్యజించారు. స్వామి నిరాడంబరంగా భక్తులకు దర్శనమిస్తున్నారు. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం అభిషేకం నిర్వహించేందుకు 9 కలశాలను సిద్ధం చేశారు. అభిషేకం అనంతరం వజ్ర కవచం, ఆభరణాలు, పూల మాలలతో స్వామిని అలంకరించేందుకు ముందస్తు సన్నాహాలు పూర్తి చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న కల్యాణోత్సవానికి వేదిక ఏర్పాటుతోపాటు వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను సిద్ధం చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామ చరణాచార్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి.



అభిషేకానికి సిద్ధం చేసిన నవ కలశాలు

యోగాపై అవగాహన ర్యాలీ



మున్సిపల్ గ్రౌండ్‌లో యోగ సాధకుల మానవహారం



అనకాపల్లిలోని జార్జి క్లబ్ వద్ద యోగాపై అవగాహన

కశింకోట: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రజలకు యోగాపై అవగాహన కలిగించేందుకు ఆదివారం అనకాపల్లిలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. పతంజలి యోగా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జార్జి క్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు ర్యాలీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను ఆచరించి, ఆరోగ్యవంతులు కావాలని అభిలషించారు. ఈ నెల 21న పెద్ద హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యోగా సాధకులు, అభిమానులు కేవీవీ సత్యనారాయణ, జి.మంగయమ్మ, కాండ్రేగుల చిన్న, కోలపర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

హిందూ మత సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

కోటవురట్ల: ద్వేషం, అసమానతల నిర్మూలనకు ఈ నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించనున్న హిందూమత సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జైహో రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. కైలాసపట్నంలోని శ్రీరాజగోపాలస్వామి ఆలయం వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. జైహో ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు మాట్లాడుతూ అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్యూరాలిటీ అండ్ ఈక్వాలిటీ (హెచ్‌పీఈ) సంయుక్తంగా సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విశాల భావాలు కలిగిన హిందూ మతాన్ని ఒక సంకుచిత చట్రంలో ఇరికించేందుకు కొన్ని మతోన్మాద సంస్థలు, వ్యక్తులు నిరంతరం ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, జైహో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి వెంకట్రావు, అర్చకులు వి.వి.సత్యనారాయణమూర్తి, నాయకులు కోన బాబూరావు, సత్యనారాయణ, రాజబాబు, అనిల్, వంశీ, వెన్నెల పాల్గొన్నారు.

ముళ్ల పొదలతో ముప్పే



వెన్నలపాలెం రహదారిలో వంతెనను ఆక్రమించిన ముళ్ల పొదలు



వంతెన వద్ద అడ్డంగా పెరిగిన ముళ్ల పొదలు

పరవాడ: ఎన్టీపీసీ–వెన్నలపాలెం రహదారి ముళ్ల పొదలతో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ, స్టీల్ ప్లాంట్ వంటి పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వందల సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు వాహన చోదకులను ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. ఇక్కడ నిర్మించిన వంతెన ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలతో రహదారి మూసుకుపోయింది. అంతేకాకుండా వంతెన దిగువన నీరు ప్రవహించే రంధ్రాలకు అడ్డంగా ముళ్ల పొదలు ఉండడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారిలో పెరిగిన ముళ్ల పొదలతో పాటు వంతెన రంధ్రాలకు అడ్డంగా పెరిగిన పొదలను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శ్రీనివాసుడి ఆలయ నిర్మాణంలో భాగంకండి



మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక: మునగపాకలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో జన్మించి వ్యాపార, ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన పలు కుటుంబాలతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీనివాసుడి ఆలయాన్ని అందరి భాగస్వామ్యంతో నిర్మించేందుకు కంకణం కట్టామన్నారు. ప్రతి ఒక్కరూ విరాళాల రూపంలో సాయం అందించాలని కోరారు. మన ప్రాంత వాసుల కల నెరవేరేందుకు తమకు తోచిన సాయం అందించి ఆలయ నిర్మాణానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి లక్ష్మణరావు, పెంటకోట ఉమేష్, ఆడారి కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, కొయిలాడ దశావతారం, ఆడారి దానకర్ణ, వెలగా రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహిళల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న మహిళా రైతులు, కూలీలు

రాంబిల్లి: పెదకలవలాపల్లిలో మహిళా రైతులు, కూలీలు నిర్వహిస్తున్న ధర్నా ఆదివారం కొనసాగింది. అటవీ భూముల చుట్టూ నేవీ నిర్మిస్తున్న ప్రహరీ గోడ కారణంగా దశాబ్దాల కాలంగా తమ సాగులో ఉన్న భూములు కోల్పోయామని, తమ పంట పొలాల్లోకి వెళ్లే దారులు మూతబడుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి ధర్నా చేస్తున్నామని, తమ ఇబ్బందులను అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

తీరంలో పర్యాటకుల సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. అనకాపల్లి, గాజువాక, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం, లంకెలపాలెం, పెదముషిడివాడ, పరవాడ, వాడచీపురుపల్లి, దీపాంజలి నగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తీర ప్రాంతాలకు చేరుకుని ఆట పాటలతో సందడి చేశారు. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడిన పర్యాటకులు సాయంత్రం తీరంలో జలకాలటలతో ఉత్సాహంగా గడిపారు.